క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


ఆంజనేయ స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారం శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో ఉపాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామి వారికి తమలపాకు పూజ, గంధం, సింధూర పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వంగల పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు పర్యవేక్షించారు.

క్రీస్తు మార్గంలో సాగాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలందరూ సుఖ సంతోషాలతో దేవుని దీవెనలతో దేవునిలో జీవించాలని ఏలూరు పీఠం అమలోద్భవి కథీడ్రల్ రెక్టర్ ఫాదర్ మైఖేల్ ఇంజమాల సూచించారు. మంగళవారం ఆయన ప్రజలకు క్రిస్మస్ సందేశం అందించారు. దేవునికి దూరంగా ఉంటే అన్యాయం, అక్రమాలు చూస్తున్నామని అన్నారు. దేవుని నమ్ముకుని సన్మార్గంలో పరోపకార బుద్ధితో జీవించాలని సూచించారు. క్రిస్మస్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలోనూ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

రబీ పంటకు బీమా చెల్లించాలి

పెదపాడు : రైతులు తమ పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబీబ్ బాషా తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు, వట్లూరులో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి అబీబ్ బాషా మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ వై సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెదపాడు : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థిని కె.శృతి రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ దాసరి మేరి ఝూన్సీ తెలిపారు. ఈనెల 24న ఏలూరులో నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో డీఎస్‌ఓ చేతుల మీదుగా శృతికి నగదు బహుమతి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరిఝూన్సీరాణి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకపోతే చర్యలు

టి.నరసాపురం: ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే చర్యలు తప్పవని ఎస్సై ఎం జయబాబు అన్నారు. మంగళవారం టి.నరసాపురం ప్రధాన సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను నిలుపుదల చేసి కేసులు నమోదు చేశారు. వాహనాలకు తప్పని సరిగా నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్, సీ బుక్, ఇన్సూరెన్స్ పేపర్లను వెంటే ఉంచుకోవాలని ఎస్సై సూచించారు. ఇటీవల కాలంలో వాహనాల చోరీలు పెరగటంతో జిల్లా ఎస్పీ శివకిషోర్, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తరచూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

స్వీయ పరిపాలన కోసమే పీసా చట్టం

కుక్కునూరు: ఆదివాసీలు తమ ప్రాంతాన్ని తామే స్వయంగా పరిపాలించే విధంగా కల్పించిన చట్టమే పీసా చట్టమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు పేర్కొన్నారు. పీసా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఆయన మాట్లాడారు. 1996 డిసెంబర్ 24న పీసా చట్టం అమలులోకి వచ్చిందన్నారు. నేటికీ ఐదో షెడ్యూల్ భూభాగంలో ఇంకా ఈ చట్టం అమలు కావడంలేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామ సభల తీర్మానం లేకుండానే ఏజెన్సీలో జరిగే ప్రతి అభివృద్ధి పనిని గిరిజనేతరులు దోచుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు సోలార్ విండ్ ఐడల్ ప్రాజెక్టులను వాడుకుంటూ ఒక్కపైసా కూడా చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచేయడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలలలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపిందని ఆరోపించారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ చార్జీల యూనిట్ రూ.2.90 పైసలు ఉంటే నేడు రూ.4.80 పైసలకు చంద్రబాబు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాడు ఆహ్లాదం.. నేడు నిర్లక్ష్యం

- ఇదీ ఏలూరు నగర పార్కుల దుస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- కనీస నిర్వహణ కరువు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ప్రజలను ఆహ్లాద పర్చిన పార్కులపై నేడు నిర్లక్ష్యం వెంటాడుతోంది. పాలకులు వీటి కనీస నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా పలు పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. 2024–25 నగర పాలక సంస్థ బడ్జెట్లో పార్కుల అభివృద్ధికి ఒక్క పైసా కూడా కేటాయింపులు చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. ప్రచార కార్యక్రమాలకు లక్షలాది రూపాయాలు వెచ్చించే అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నగర వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

సంజయ్ జాజు హయాంలోనే అభివృద్ధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సంజయ్ జాజు హయాంలో నగరంలోని పార్కులకు స్వర్ణయుగంగా చెప్పవచ్చు. ఏలూరులోని 14 ప్రధాన పార్కుల అభివృద్ధికి అప్పటల్లో పెద్ద ఎత్తున నిధులను వెచ్చించారు. పార్కుల చుట్టూ సిమెంట్ డిజైన్ల ఏర్పాటు చేశారు. పార్కు లోపల వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటవిడుపు కోసం ఊయలలు, జారుడు బల్లలు తదితర హంగులు కల్పించారు. కృష్ణా కెనాల్ వెంబడి సిమెంట్ డివైడర్లను ఏర్పాటు చేసి రంగులతో తీర్చిదిద్దారు. జాతీయ పండుగల వంటి సమయంలో విద్యుత్ లైటింగ్‌లను అమర్చారు. నాడు ఏలూరు నగరానికే ఒక విధమైన కళ వచ్చిందని, మళ్లీ అటువంటి పూర్వ వైభవం తీసుకురావాలని నగర వాసులు కోరుతున్నారు.

శిథిలావస్థలో..

ఏలూరు నగర జనాభా దాదాపు 4 లక్షలు. వీరిలో 15 శాతం మంది అంటే సుమారు 60 వేల మంది వరకు 15 ఏళ్లలోపు బాల బాలికలు ఉన్నారు. వీరందరికీ సెలవు రోజుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు నగరంలో సరైన పార్కు లేదని చెబుతున్నారు. ఆర్ఆర్‌పేట ఎన్‌టీఆర్ పార్కు, పత్తేబాద బృందావనం పార్కు, ఏటిగట్టున ఉన్న జన్మభూమి పార్కులు కొద్దిగా చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మిగతా పార్కులన్నీ నిర్వహణా లోపంతో శిథిలావస్థకు చేరాయి. ఇవి అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఏటిగట్టు ప్రాంతంలోని జన్మభూమి పార్కులో పట్టపగలే మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా రూ.25 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన జన్మభూమి పార్కును 2003 సెప్టెంబరు 10న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సూర్జింత్ సింగ్ బర్నాలా ప్రారంభించారు. ఈ పార్కు పూర్తిగా శిథిలమైంది. ముఖ ద్వారా మాత్రమే గత జ్ఞాపకాలకు సాక్షి భూతంగా కన్పిస్తుంది.


టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా జన్మభూమి పార్కు ముఖద్వారం


గవర్నర్ సూర్జింత్ సింగ్ బర్నాలా ప్రారంభించినట్టు చూపుతున్న శిలాఫలకం


జన్మభూమి పార్కులో ధ్వంసమైన వాటర్ ఫౌంటెయిన్


పార్కులో తుప్పపట్టిన చిన్నారుల ఆట వస్తువులు, పెరిగిన ముళ్ల చెట్లు

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. చిన్నారులకు, పెద్దలకు, వృద్ధులకు ఆటవిడుపుగా ఉండేపార్కుల అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు. కుటుంబం అంతా కలిసి పార్కులో సేదతీరే విధంగా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

– పి.కిషోర్, ఏలూరు నగర కార్యదర్శి, సీపీఎం

నిధులు కేటాయించాలి



పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. వీటి సంరక్షణకు అవసరమైన సిబ్బందిని నియమించాలి. నగరంలోని పార్కులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నగరపాలక సంస్థ, పోలీస్ వ్యవస్థ అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

సూక్ష్మ కళతో క్రీస్తు జననం


గోరుపై క్రీస్తు జనన ప్రతిమ

ఏలూరు (టూటౌన్): క్రిస్మస్ సందర్భంగా బొటన వేలు గోరుపై క్రీస్తు పుట్టుకకు సంబంధించిన ప్రతిమను అగ్గిపుల్లలు, చాక్‌పీస్ పొడిని ఉపయోగించి అంగుళం సైజులో రూపొందించారు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. ఈ ప్రతిమతో పలువుర్ని అబ్బుర పరుస్తున్నారు. ప్రజలకు ఈ విధంగా ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మిత్ర ధర్మానికి తూట్లు


మదర్ థెరిస్సా, అంబేద్కర్, గాంధీజీ, సీఎం చిత్రపటాలు

ఏలూరు (టూటౌన్): అధికార పార్టీ నేతలు కూటమి ధర్మానికి తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల్లో తన ఫొటోతో పాటు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో తప్పనిసరిగా పెట్టాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఐనా ఏలూరు కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫొటోల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోను పెట్టకపోవడం పట్ల జనసేన నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే స్తున్నారు.





చలికి గజగజ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం నుంచి వాతావరణం ఉదయం పూట కాస్త ఎండ, తరువాత వెంటనే వాన, ఆ తరువాత మరోసారి ఎండ అనంతరం చిరుజల్లు ఇలా దోబూచులాడుతుంది. సోమవారమంతా మబ్బుల వాతావరణంతో పాటు జల్లులు కురిసి చలి ప్రారంభమైంది. మంగళవారం వాన కొద్దిగా పెరిగి రోజంతా కురుస్తూనే ఉండడంతో విపరీతమైన చలితో ఏలూరు నగరంలో ప్రజలు గజగజలాడిన దృశ్యాలివి. ఇదే వాతావరణం బుధవారం కూడా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)









క్రిస్మస్ సంబరాలు

క్రిస్మస్ కాంతులతో ఏలూరు నగరం ధగధగలాడుతోంది. నగరంలోని చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు మన్నా, లూథరన్ తదితర క్రైస్తవ మందిరాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్‌లు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు


ఏలూరు మన్నా చర్చ్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న బిషప్ ఎలీషా రాజు


క్యాండిళ్లతో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఏలూరు (టూటౌన్): బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్జీ కుమారి మాయావతి పిలుపు మేరకు రాజ్యసభలో బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరుతూ బీఎస్పీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి కలెక్టరేట్‌కు వెళ్లి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిర్రా భారత్, రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్ బాబులు మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, అమిత్ షా తక్షణమే భారత ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసి వెంకటేశ్వర్లు, కలపాల రాజకుమార్, బుంగా ఏసు, కర్రా అంబేద్కర్ ,చాట్ల శ్రీను, పోసు మణి, గుదే రాంబాబు, సీహెచ్ సాయిరాజు, తమలం ప్రసాద్, బేతాళ నాగరాజు, పల్లా యేసేబు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు రాజనాల రామమోహన్‌రావు అధ్యక్షతన వహించారు.

పారిశుద్ధ్య లేమిపై స్వపక్ష నేత నిలదీత

మేయర్ అధ్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై సాక్షాత్తు స్వపక్షానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం నిలదీశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో పొందుపరచిన మొత్తం 19 అంశాలను చర్చించారనే దానికన్నా చదువుకుంటూ వెళ్లి పోయారనే చెప్పాలి. సమావేశంలో చోడే వెంకటరత్నం మాట్లాడుతూ నగర పాలకసంస్థలో దాదాపు వెయ్యి మంది వరకు ఉన్న పారిశుద్ధ్య కార్మికులు కేవలం మస్టర్ పాయింట్ల వద్ద సంతకాలు పెట్టి ఎవరి దారిన వారు వెళ్లి పోతున్నారంటూ సభ దృష్టికి తెచ్చారు. నగరపాలక సంస్థ నుంచి పారిశుద్ధ్య నిర్వహణకు ఏటా దాదాపు రూ.5.50 కోట్లు ఖర్చు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్మికులు ఆత్మ పరిశీలన చేసుకుని విధుల్ని సక్రమంగా నిర్వహించాలని కోరారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గుడిదేశి శ్రీనివాస్ కాపు కల్యాణ మండపానికి స్థలం, నిధుల కేటాయింపు అంశంపై మాట్లాడుతూ అన్ని కులాల అవసరాల మేరకు స్థలాలు కేటాయించడం మంచిదన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ 2019–20, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.5.35 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఆరు పనులను రద్దు చేసేందుకు కౌన్సిల్ ఆమోదానికి ఉంచామన్నారు. వీటి స్థానంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నట్టు తెలిపారు. తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించిన 60 క్లాప్ వాహనాలను ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏజెన్సీకి ఉన్న రూ.2.93 కోట్లు బకాయి చెల్లించే వరకు క్లాప్ వాహనాలకు ఆయిల్ ఖర్చు కార్పొరేషన్ భరిస్తున్నట్టు వివరించారు. ఏలూరు నగరంలోని రోడ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, వీధి లైట్లు నిర్వహణ, శానిటేషన్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మొత్తంగా కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సొంత పార్టీ సభ్యుల సహకారంతో మమ అనిపించారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, పలువురు కార్పొరేటర్లు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఏసీ జి.చంద్రయ్య, డీసీ శివారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్